రాత్రికి రాత్రి సూరయ్య 'ఆ' పార్టీలోంచి ఈ పార్టీలోకి మారాడు.

సుబ్బయ్య 'ఈ' పార్టీలోంచి ఆ పార్టీలోకి మారాడు.

దేశం వింధ్య పర్వతంలాటి ముక్కుమీద వేలేసుకుంది.

కొందరు పైప్రైవేటుగా నవ్వుకున్నారు.

మరికొందరు పబ్లికున నవ్వారు.

"నవ్విపోదురుగాక మా కేటి సిగ్గు మా యిచ్ఛయేగాక మాకేటి వెరపు" అంటూ విడి విడిగా పత్రికా ప్రకటన లిచ్చారు సూరయ్య, సుబ్బయ్య.

దేశం మొత్తంమీద ఈ వార్తవిని నవ్వని తెలుసుకోవాలంటే మొదటిరోజున మా వూరొస్తే చాలునని బందరు, తెనాలి, ఏలూరు, తణుకు వాళ్ళు అనుకున్నట్టే-రాజకీయ-పరిణామాలు తెలుసుకోటానికి మా సీతాపతి దగ్గర కొస్తే చాలు అనుకుంటారు సిరిపురం వాళ్ళు.

ఎన్నికలొస్తే, దీపావళికి పిల్లలు సంబర పడినట్టు, పూనకం పట్టినట్టు అయిపోతాడు సీతాపతి.

తారాజువ్వల్లాటి వాగ్దానాలు
మతాబాల్లాటి మొహాలు
చిచ్చుబుడ్డులాటి చిరునవ్వులు
విష్ణు చక్రాల్లాటి కళ్ళు
భూచక్రాల్లాటి కాళ్ళు



ఎమ్వీయల్

# ఊరు నవ్విన కారణం

వాడు, నవ్వుకోనివాడు, కనీసం పన్నెత్తి మాటాడనివాడు, పెన్నెత్తి ప్రకటన చెయ్యని వాడు సిరిపురంలో సీతాపతి మాత్రమే!

ర ర ర

సీతాపతి నవ్వలేదని, అసలు మాటాడ లేదనీ విన్న దేశం మళ్ళా వేసుకోటం ఎందుకని ముక్కున వేసుకున్న వేలు తియ్యటం మానేసింది.

సీతాపతి అంటే ఎవరు?

ఎన్నికల్లో తొలి అక్షరంలాంటివాడు, రాజకీయాల్లో గుణింతంలాంటివాడు. ఎప్పుడూ నవ్వుతూ పేలుతూ యితర్ల మీద టపాకాయలు పేల్చుతూ దేశంలో సిరిపురానికో గుర్తింపు తెచ్చిన మనిషి.

తెలుగుదేశంలో సినిమా బావుందో లేదో

సిమటపాకాయల్లాటి చెణుకులు

ఎలెక్ట్రిక్ తాటాకు టపాసుల్లాటి ఎత్తి పొడుపులు—

నీళ్ళ పళ్ళెంలో మతాబా పువ్వుల్లాటి పలకరింపులు—

ఓహో! "ఏమానందం బేమానందము-
ఏమానందం బిలాతలంబున."

అలాటి సీతాపతి పార్టీల్లో వచ్చిన కీలక మార్పుపట్ల ప్రకటించిన వైఖరికి కారణం వారుకి, వూరికి, తాలూకాకి, జిల్లాకి, రాష్ట్రానికి దేశానికేకాక సీతాపతి యింట్లో వాళ్ళకూడా అంతుపట్టలేదు.

* * *

"రాత్రి తిన్న అన్నం అరిగివుండదు సీతాపతి బావకి" అన్నాడు సమితి ప్రెసిడెంటు.

"అబ్బే! పొద్దుట తరవాణి ఆవకాయ ముక్క కూడా సుబ్బరంగా తిన్నారన్నయ్య గారూ" అంది సీతమ్మగారు.

"ఆడపిల్ల పెళ్ళికెదిగిందని దిగులుట్టిం దేమో" ఓ బడిపంతులు నిట్టూర్చాడు.

"ఎప్పుడో అనుకున్న మేనరికమేగా" అన్నాడు సీతాపతి బావగారు.


"అబ్బాయి మెడికల్ సీటుగురించి బెంగేమో" అన్నాడొక పైరవీ.

"అబ్బే! డొనేషనూ వగైరా సెటిల్మెంటయి పోయి పెద్దెత్తున సమ్మందాలొస్తుంటే" అంది సీతాపతి తోబుట్టువు.

"అసలాయనకి సీతాపతీ అని పెళ్ళాం పేరుతో పిలిపించుకోటం యిష్టంలేదేమోనండీ" అన్నాడు పొరుగూరినించి పరామర్శకి వచ్చిన ఓ పెళ్ళాం చాటు మొగుడు.

"బలేవారే! అసలలా పిలవకపోతే వారు చిన్నబుచ్చుకునేవారు" కరణం కొట్టిపారేశాడు.

ఊళ్ళో చెలరేగిన ఈ చిచ్చు రేగి రేగి దేశమంతా వ్యాపించటంతో సిరిపురం చల్లారని అగ్నిగుండమైంది.




సీతాపతి గంభీరమైన చూపు, ఆ ముఖం దుర్నిరీక్ష్యంగా తయారయ్యాయి. తొలిరోజునే సీతమ్మగారు ఆంజనేయుడు గుడికెళ్ళి పూజ చేయించి తెచ్చిన కుంకం సీతాపతి నుదుట రూపాయంత అద్దటంతో ముఖం వీరాంజనేయ స్వరూపంలా మారింది. దానికి ఆయన ఎత్తు పళ్ళు, బిగించేసిన మూతి మరి కాస్త దోహదం చేశాయి.

వచ్చేపోయేవాళ్ళ పరామర్శలకి, చూపులకి వీలుగా వీధి వరండాలో ఓ కుర్చీవేసి సీతాపతిని కూచోబెట్టారు. తొలిరోజున ఎదురుగావచ్చి దణ్ణాలు పెట్టినవాళ్ళు మలిరోజున కాస్త పక్కకి తొలగి, దూరంగా జరిగి సాష్టాంగ పడ్డారు. మూడోరోజున కొబ్బరికాయలు పగిలి, కర్పూరాలు వెలిగాయి. అయిదోరోజు ఒకరిద్దరికి జ్వరాలువచ్చి ముగ్గురు నలుగురికి తగ్గాయి. ఆదేరోజున గవరయ్యకి పూనకం వచ్చింద. ఈ వార్తలు గాలికన్నా వేగంగా దిగంతాలకి ప్రవహించాయి.

"దివి తాలూకాలో రెండో వార్షికోత్సవం జరుపుకోబోతున్నా కూడా అక్కడ బాధితు

లకు వసతులు కల్పించకపోవటమే సీతాపతి గారి బాధలకు కారణం" అని టింకా పత్రిక ప్రకటించింది.

"వారి బాధంతా మొన్నటి నెల్లూరు, ప్రకాశం ప్రాంతాల బాధితులకోసమే" అని ఉంకో పత్రిక నిరసించింది.

"అగ్నిప్రమాదలవల్ల కలుగుతున్న నష్టానికి వారి గుండె కరిగి పాషాణమైపోయింది" ఇంకో పత్రిక ఢంకా కొట్టింది.

"అవేవీకాదు. సీతాపతిగారికి కడుపులో గుల్మం" అన్నాడొక దీర్ఘరోగి.

పత్రికల్లో రాతలు గోడలమీద గీతలుగా మారాయి. అవి గోడలుదాటి కోటలపై జెండాలయ్యాయి. ఎవరికి వారు తమ నీడలో తమ వునికిని సమర్థించుకోటానికి, మరొకరి నీడ తాలూకు కాళ్ళు పట్టుకుని కిందికి తోసేందుకు ముఖాముఖి, వ్యాసావాసి, కవితా కవితి తలపడ్డారు.

"ఇందరికి సాయం చేస్తానని ఎం జి ఆర్ మాట తప్పాడు."

"అదేంకాదు, అర్స్ తెచ్చుకున్న పంటి నొప్పి."

"మీ మొహం ఆంధ్రలో అసమ్మతి వర్గ పరాజయం."

"తమ బొందః సీతాపతిగారెప్పుడూ అధికార పక్షమేః ముఖ్యమంత్రిగారి సంప్రదాయ సిద్ధ షష్టిపూర్తి వుత్సవాలమీద నిందలే వారికి బాధాకరంగా పరిణమించి వుంటాయి."

రాజకీయంలో వినవచ్చిన ఈ రణగొణ ధ్వనులు యితర రంగాలకు విస్తరించాయి.

"విద్యారంగంలో వస్తామని భయపెడుతున్న మార్పులే వారిని చింతాక్రాంతుణ్ణి చేశాయి."

"నెల నెలా జీతాలొస్తే (పైగా డైరెక్టుగా) లెక్చరర్లు పాడయిపోయి పాఠాలు చెప్పరన్న దిగులే వారిని కుంగదీసింది."

"కళాప్రపూర్ణ రాలేదని సీతాపతిని బెంగెట్టుకోవద్దని చెప్పండి. పై పంటల టయానికి నే సాయంగా దగ్గరుండిప్పిస్తాను" ఓ మోతుబరి తెగించి కణూరంపించాడు.

"అగ్రనటుల సినిమాల పరాజయ పరంపరే సీతాపతిగారి మానసికాందోళనకు ప్రధాన కారణం" అని ప్రకటించాయి కొన్ని అభిమాన సంఘాలు.

"మీ ఏదం: వాసరలు నిసిలాము చూరడు. ఆనిదించీ వాడు రాస కీరపాణి. మిత్రశాకాసు రితగ తోమడమే వారి మూలానికి విచారణ కారణం" అంటూ అచ్చు తప్పుల పత్రిక ఓ పేజీ సవరణలతో ప్రకటించింది.

* * *

అయిదోరోజుకి లాబీ వర్గాలనించి పెస్థాయి వార్తలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రిగారు ఈసారి శృంగేరీ పీఠానికి వెళ్ళటం మానేసి సిరిపురం వచ్చి సీతాపతిగారిని సందర్శించాలనుకున్నారని, కానీ తుఫాను ప్రాంతాల సహాయానికి తక్షణ చర్యల నిర్వహణకోసం ఆగిపోయారనీ కొందరన్నారు. ఇందిరాగాంధీ తంజావూరు ఎన్నికల విషయం జ్యోతిష్కుణ్ణే గాక సీతాపతిగారిని కూడా సంప్రదించాలనుకొందని ఇంకా కొందరన్నారు.

"పై మాటలు మేము నమ్మటలేదు. మేము మొన్ననే చెప్పినట్లు రాజ్‌నారాయణ్‌గారి మౌనమే సీతాపతిగారి సీరియస్‌నెస్‌కి కారణమని మేం భావించటమేకాక విశ్వసిస్తున్నాము. పైగా సీతాపతిగారు గంభీర ముద్ర దాల్చిన రోజు 'శని'వారం కావటంవల్ల ఈ శనివారానికి ఆంధ్రదేశంలో విపత్తులకి ఏదో సంబంధం వుందన్న మా అనుమానం బలపడటానికి ఆస్కారం కనబడుతోంది" ఓ పత్రిక సంపాదకీయం రాసింది.

"రాజ్‌నారాయణ్‌గారి మౌనంకాదు, వినోబాగారి ప్రసంగమే వారి బాధాతప్త హృదయ వేదనకు కారణం" ఘరో పత్రిక తొలిపేజీలో పెద్దక్షరాలతో రాసింది.

"ఆ రెండూకాదు. ఏ దేశమూ వెళ్ళకుండా వాజ్‌పాయ్ వూళ్ళోనే వుండిపోటం సీతాపతికి హృదయ శల్యమైంది."

"ఒకానొక కండక్టరు ఒకానొక గౌరవ అసెంబ్లీ సభ్యుడికి ఒకానొక రోజున బస్సులో సీటివ్వకుండా అగౌరవ పరచడమే సీతాపతిగారి కన్నీటికి కారణం."

"గోవధ"

"కిరసనాయిలు"

"రైల్వే బోనసు''

"జె.పి.''

"కృపలానీ''

"గ్రామోద్యోగ ఖాదీ భాండార్''

"పేపర్ల వుట్"

"రేడియో నాటకాలు''

"అకాడెమీ బహుమతులు"

"మద్రాసులో సారా"

"సారాల్జింగ్ మ్యూజియమ్"

"యజ్ఞీ ''

ఈ రణన్నినాదాల తాకిడికి భూనభోంత రాళాలు అదరగా, రేడియోలు, టీవీలు పగలగా, పత్రికల అచ్చులు చెదరగా ఒక కేక ఆది మానవుడి తొలి పిలుపులాగా వినిపించింది.

"సైలెన్స్"

తెలుగు మాస్టరు వేసిన ఆ కేకకి అంతా నిశ్శబ్ద రత్నాకరమై నిశ్చలంగా నిలిచిపోయింది.

"మీ శ్రార్ధం! మీ పిండాకూడు. దొమ్మ్రరాస్కెల్స్! ఏవిట్రా ఆ గోల! ఓ పక్క ఆ సీతాపతిగాడు భోరు భోరున ఏడుస్తుంటే మీరూ మీ దిక్కుమాలిన ప్రకటనలూ-జడ్డివెధవల్లారా! స్టాండ్సప్పాన్ది బెంచెస్! అస లెందుకు సీతాపతి అలా అయిపోయాడు అవటా అని ఒక్కడు ఒక్కడు నెక్స్ట్, నెక్స్ట్! నెక్స్ట్ ఒక్కడు ఆలోచించాడూ! ఎబ్బే లేదు. ఓ బడ బడ వాగుడు. అసల్సంగతి నే చెప్తావినండి

"ఈ సీతాపతిగాడు—వీడు నా స్టూడెంటే! పుట్టినప్పుడు వేలెడుండేవాడు. పెరిగాడు సంతోషం నాకన్నా పేరు తెచ్చుకున్నాడు యింకా సంతోషం. మరి అలాటి వాడిమీద రాస్తే మంచి కథ, ఒరిజినల్ కథ రాయాలి గాని, వీడు పదిహేనేళ్ళక్రితం వాడెవడూ .. ముళ్ళపూడి వెంకటరవణ రాసిన 'రావనరసు కథ' కాపీ కొడతాడూ వీడు.ఎంత దారుణం .. మరందుకే సీతాపతిగారు విచలించిపోయారు, విచారగ్రస్తులైపోయారు, విద్రావణ హృదయుడైపోయాడు. అయ్యా అదీ విషయం. సిడౌన్స్."

ర ర ర

మనవి మాటలు:

సారీ పాఠకులూ! నేను రావనరసు కథ అనుకరించానన్నమాట నిజవేగాని కాపీ కొట్టలేదు. మా మాస్టారీ విషయం చెప్పినా వినిపించుకోని శివతాండవం చెయ్యటంతో నేనొన్నోర్మూసుకున్నాను. ఇంతకీ సీతాపతి నోరు మూసుకుని గంభీరంగా కూచున్న కారణం చెప్పేసి కథ ముగిస్తాను.

సీతాపతి ఎన్నికల్లో తన అభ్యర్థి గెలిచాక చాలా ఆశలు పెట్టుకున్నాడు. అమ్మాయి పెళ్ళి, అబ్బాయి మెడికల్‌సీటు, భూసంస్కరణల్లో తేడాలు అన్నీ సద్దుబాటయి పోతాయనుకున్నాడు. కాని తన అభ్యర్థి రాత్రికి రాత్రి గీత దాటిపోవటంతో మాట పడిపోయింది. ఆసింటావున్న అపొజిషన్‌వాడు యిటు జరగటంతో సీతాపతిగారి పళ్ళు కదిలిపోయి గిట్ట కరుచుకుపోయాయి. దాంతో పడిపోయినమాట పైకి రాలేకపోయింది. అంతే సంగతులు చిత్తగించవలెను.